# నవలోకం



## మూగ రాగం

— "కమల్"

"అరూ"

ఉలిక్కిపడింది అరుణ. ఉవ్వెత్తుగా వస్తున్న సముద్ర కెరటాలను తన్మయత్వముతో చూస్తున్న అరుణ ఉలిక్కిపడింది.

"ఏమిటీ ఆలోచన, అరూ!" మృదువుగా అన్నాడు భాస్కర్.

అతని నోటినుండి తన పేరు ఎంత తియ్యగా వినిపిస్తుంది. ఇలాగే అతని నోటినుండి, ఎప్పుడూ జన్మ జన్మలకూ అతని పిలుపు వినిపిస్తుంటే ఇంకా తన కేమి కావాలి.

"ఏమిటి అరూ! ఎదురుగా నన్ను వుంచుకోనేనా ఈ ఆలోచన" అన్నాడు మృదువుగా.

"అబ్బే, అదేమి లేదు! భాస్కర్! ఎప్పుడూ మనం ఇలాగే వుండాలని భగవంతుని కోరు కుంటున్నాను"

చిన్నగా నవ్వి "నీకా అనుమానము అక్కరలేదు, అరూ! నిన్ను వదిలి ఒక్క క్షణంకూడా వుండను."

"నిజం! ఇంక నేనేమి కోరను!" తన్మయత్వముతో భాస్కర్ చేతులలో మోహం దాచుకుంది.

"పిచ్చి అరూ!" అంటూ అరుణ తల నిమురుతూ, "అరూ! ఈ రోజే మన విషయము మా నాన్నగారితో మాట్లాడుతాను."

చీకటి నలువైపుల క్రమ్ముతుంటే, "లే! అరూ! ఇంక వెళదాం, ఉమ నీకోసం ఎదురు చూస్తుంటుంది."

లేవాలని లేక పోయినా అక్క తన కోసము ఎదురు చూస్తుందని "పద! భాస్కర్," అంటూ లేచి చీర దులుపు

కుంటూ, "నేనూ అక్కాతో మన విష యము చెపుతాను," భాస్కర్ చేతిని పట్టుకొని నడిచింది.

*  *  *

వంట గదిలోని కూరలు, అన్నము డిష్‌లో వేసి, టేబుల్‌పైన పెట్టింది. రెండు పళ్ళెములు కడిగి, టేబుల్‌పై పెట్టి చేతులు శుభ్రముగా కడుగుకొని గోడ గడియారము వంక చూసింది. "పైము ఆరున్నర అయ్యింది" అను కుంది. ఇంతలో అవునన్నట్లుగా గంట మ్రోగినది. "ఏమిటీ, ఈ రోజు అరుణ ఇంకా రాలేదు" అనుకుంటూ ఫిలింఫేర్ తీసికొని వరండాలో కుర్చీలో కూర్చొని తిరగవేస్తూంది ఉమ. పేజీలు తిరుగు తున్నా, ఆమె ఆలోచనలు భాస్కర్ చుట్టూ పరిభ్రమిస్తున్నాయి.

'భాస్కర్'ఎంత చిలిపిగా ఉంటాడు. కళ్ళతోనే నవ్వుతూ పలకరిస్తాడు. ఆ చూపు చూసేసరికి తన గుండెలు టక టకా కొట్టుకుంటాయి. సూటిగా కళ్ళలోకి చూడలేక తల సిగ్గుతో దించుకుంటుంది. కాని తనకు అతనితో మాట్లాడాలని, కళ్ళ లోకి చూడాలని వుంటుంది. కాని అతను ప్రక్కన నిలిచేసరికి పాడుసిగ్గు, ఎక్కడ లేనిది ముంచుకొస్తుంది, ఇంక తనేమి మాట్లాడగలదు.

ఒకసారి ....

అరుణా, తను, భాస్కర్ లాన్‌లో కూర్చొని మాట్లాడుకుంటున్నారు.అరుణ, భాస్కర్ ఆ రోజు మెడికల్ కాలేజీలో జరిగిన ఆపరేషన్ కేసుగురించి మాట్లాడు కుంటున్నారు. తను వారిద్దరి వంక కుతూ హలముగా చూస్తూ వారి చర్చ వింటూంది.

"అదికాదు భాస్కర్! మరీ అంత సెనిటివ్‌గా వుండకూడదు. మనం డాక్టర్స్‌మై వుండి మనస్సు నిబ్బరంగా వుండకపోతే ఎట్లా! మనము రోజూ ఎన్నో పుట్టుకలను, చావులను చూస్తు న్నాము. మనస్సు కఠినముగా వుంచు కోవాలి."

"అదికాదు, అరుణా! ఎంతమనస్సు ని బ్బ ర ము గా వుంచుకుందామన్నా, ఒక్కో క్షణము మన మనస్సు మన మాట వినదు. ఆ అమ్మాయి నన్ను గట్టిగా పట్టుకొని, "డాక్టర్! మా అన్నయ్య జీవిస్తారని చెప్పారుగా! ఎందుకిలా జరిగింది డాక్టర్!" అంటూ చొక్కా పట్టుకొని గుంజేస్తూ హృదయ విదారకముగా ఏడుస్తుంటే నా మనస్సెం దుకో చెప్పలేనంత బాధ వేసింది. వూహించని ఆ పరిస్థితిలో నీ వున్నా అదే చేసేదానివి. మన బాస్ వచ్చి నన్ను సముదాయించినా నా మనస్సంతా అయోమయంగా అయింది. మనమెంత డాక్టర్లమైనా మనకు మనస్సుంటుంది కదా! మీ రేమంటారు ఉమా!" అంటూ తన వంక జాలిగా చూసేసరికి ఆసమస్య నన్ను సాల్వ్ చేయమనేసరికి తడబడ్డాను. అయినా గొంతు పెగుల్చి

కాని, "తప్పకుండా ! ఆ పరిస్థితిలో ఎవ్వరైన బాధపడతారు. అందులో సున్నిత హృదయమున్న వారికితప్పదు" అన్నది.

చిరుకోపముతో అరుణ, "నీవు అదే అంటున్నావు, ఇంక మీరిద్దరు ఒకటైనా రంటే, నేను ఇక ఏమి చెప్పిన నమ్మరు" అన్నది.

అందుకు భాస్కర్ చిలిపిగా.

"ఆ ! అందరూ నీ వంటి వారే వుంటారా ! ఏమంటారు ఉమా ?" అంటూ నా వంక చూశాడు.

ఇందాకా అరుణ అన్న మాటకే సిగ్గుతో బుగ్గలు ఎర్రగా కందిపోగా తలవంచుకున్న నాకు భాస్కర్ మాట లకు తలయెత్తి.

"అదేమికాదు భాస్కర్, మా అరూ పైకి అలా కనిపిస్తుందిగాని దానిమనస్సు చాలా సున్నితమే," అంటూ అరుణను సమర్థించాను.

భాస్కర్ కుర్చీ వెనుకకు జారగిల బడి" ఇంకేం ! మీరు అరుణను ఒక్క మాట అననీయరుగదా ! యింకేం, అరుణ మీ అక్కగారి సపోర్టు వుంది కదా !"

"అవును మరి. మా అక్క కదా !" అంటూ చిలిపిగా ఒత్తి పలికింది. అరుణ వంక ఆప్యాయంగా చూసి, "చాలా పైమయింది, భోజనానికి పదండి. భాస్కర్. మీరు మాతో పాటు భోం చెయ్యాలి" అన్నది.

అందుకు భాస్కర్, "ఓ యస్ ! తప్పకుండా ! ఇంతకు వంట ఎవరు చేశారంటారు. మీ చెల్లెలు గాని చెయ్య లేదు కదా ! లేకపోతే చక్కటి హోటల్ భోజనము పోయిందని వుసూరుమనాలి." అంటూ మొహం కంగారుగా పెట్టి అన్నాడు.

ఒకసారి అరుణ కూర మాడ్చిన సంగతి గుర్తుకొచ్చింది. తను వచ్చే నవ్వును ఆపుకుంటూ, "అంత భయ పడక్కరలేదు లెండి. రోజూ వంట నేనే చేసాను కదా ! రండి." అంటూ లోనికి దారి తీసింది.

ఆ విధముగా తననే ఎపుడు సపోర్టు చేస్తు వుంటాడు. అలా తనని పొగుడు తుంటే తనకి చెప్పలేనిసిగ్గు వస్తుంది. ఇదంతాఎందుకు తను భాస్కర్‌నే ప్రేమి స్తుంది. భాస్కర్ లేనిదే తను జీవించ లేదు. ఎప్పుడైన భాస్కర్ తననుఅడిగితే వెంటనే ఒప్పేసుకుంటుంది. అయిన తను ఎక్కువగా చదువుకోలేదు. S. S. L. C. వరకు చదివింది. వంట చెయ్య గలదు. డాక్టరైన భాస్కర్‌కు ఇంత తక్కువ చదువు చదివిన తను, జీవిత ములోసుఖపడగలరా! అయినా భాస్కర్ తనను వివాహ మాడగలడా! ఏమైనాతన చదువు తనజీవితములో అటంకములేదు. కదా ! అయినాతనకు చదువును మించిన సంస్కారమున్నది కదా ! ఇలాంటి

ఆలోచనతో, ఉమ ఎటూ తేల్చుకోలేక పోతుంది.

ఇంతలో అరుణ, భాస్కర్ గేటు తెరచుకొని లోపలికి వస్తున్నారు. ఉమ, చేతిలో ఫిలింఫేర్‌ను టేబుల్‌పై పడ వేసి, "ఏం, అరూ! ఇంత ఆలస్య మైందేం!" హాస్పిటల్లో వర్కు ఎక్కు వైందా! పదండి, భోజనము చేద్దురు గాని, భాస్కర్, మీరురండి."

"అవునండి, వర్కు చాలా వున్నది" చిలిపిగా అరుణ వంక చూశాడు.

అరుణ మౌనముగా లోపలికి దారి తీసింది.

భాస్కర్ ఒక్క క్షణం ఆలోచించి, "నేను వెళ్ళుతాను ఉమగారూ!" అంటూ వెనక్కు అడుగు వేశాడు

"అరే, అదేమిటి, తర్వాత వెళ్ళొచ్చును. రండి" అంటూ ఉమ పిలిచింది.

"ఇపుడు కాదులెండి, పనుంది" అంటూ ఇంకో మాటకు ఎదురుచూడ కుండా వెళ్ళిపోయాడు. ఉమ మన స్సెందుకో చివుక్కుమన్నది.

"ఇంతవరకు తన మాట వినకుండా వెళ్ళనదిలేదు. అయినా తనకి పనివున్న దేమోలే! అయినా దీనిలో బాధపడవల సిన పని ఏమున్నది" అని మనస్సు సరిపుచ్చుకున్నా ఆ సమాధానము సంతృప్తి కలిగించ లేదు, ఏదో వెలితిగానే అనిపించింది. లోపలకు వెళ్ళేసరికి అరుణ డైనింగ్ టేబుల్‌పై రెండు చేతులు గడ్డమునకు ఆనించు కొని ఏదో దీర్ఘముగ ఆలోచిస్తూంది.

ఉమ మనస్సు ఉండబట్టలేక, "ఏమే అరూ! భాస్కర్ ! అలా వెళ్ళి పోయారేం" అంటూ పళ్ళెములో అన్నం వడ్డిస్తున్నది.

అరుణ కూర వడ్డించుకుంటూ, "బహుశ ఏమైన పని వున్నదేమో" అని అన్నది

తర్వాత ఇద్దరూ మౌనముగా భోంచే స్తున్నారు. ఇద్దరు ఎవరి ఆలోచన లలో వారున్నారు. ఉమ ఎందుకో తల ఎత్తింది. అరుణ పళ్ళెములో అన్నం కెలుకుతూంది.

"ఏం అరూ .... అన్నం కెలుకుతు న్నావు. సయించడము లేదా? ఒంట్లో బాగా లేదా?" అంటూ ఆత్రుతగా అడి గింది.

అరుణ తలయెత్తి, ఉమ మొహం లోకి చూస్తూ, "అక్కా! నీకు ఒక మాట చెప్పాలి." అంటూ సంశయముతో ఆగింది.

"చెప్పు అరూ! నా దగ్గర సంశయ మెందుకు?" ఆప్యాయముగా అడిగింది.

'నిజమే .... అక్క దగ్గర సంశయ మెందుకు? అమ్మ నాన్న చనిపోయిన దగ్గర్నుండి, తనను ఎలా కంటికి రెప్పలా చూచింది.'

"చెప్పు అరూ!" అన్న మాటకు తన ఆలోచనలో నుండి తేరుకున్నది.

అయిన ఈ విషయము ఎలా చెప్పాలో అర్థము కావడము లేదు. సిగ్గుతో తల యెత్తలేక పళ్ళెములో గీతలు గీస్తూ


"అదికాదక్కా. నేను..."

"ఊఁ ! నీవు" అంటూ నవ్వుతూ అడిగింది. అరుణ అలా నసుగుతూ చెపుతుంటే. చిన్నప్పటి అరుణ గుర్తు కొచ్చింది. అరుణ తనకు ఏమైన కావలిసివస్తే అలాగే నసుగుతూ చెపుతుంది. చీరలు కడుతున్న అరుణ అలాగే అడుగుతుంటే అరుణకు తనమీద ఎంత గౌరవముందో తెలుస్తుంది. యింతలో అరుణ మాటలకు తలయెత్తింది.

"నేను భాస్కర్‌ను ప్రేమిస్తూన్నానక్కా. అతను కూడా నన్ను ప్రేమిస్తున్నాడు. మే మిద్దరము నీ అంగీకారమైతే పెళ్ళిచేసుకుందా మనుకుంటున్నామక్కా" అంటూ అప్పటి వరకునెమరు వేసుకున్నదంతా గబగబాచెప్పి. అక్క మొహంలోకి చూడలేక సిగ్గుతో పళ్లెములో చెయ్యి కడిగేసుకొని అక్కడి నుండిలేచి తనగదిలోనికి వెళ్ళిపోయింది.

అరుణ చెప్పేదేమిటో, ఉమకి మొదట అర్థము కాలేదు. తర్వాత అర్థమవసాగింది. తల గిర్రున తిరుగుతున్నట్లనిపించింది. బొమ్మలాగా అలాగే వుండిపోయింది.

"ఏమిటి తనువింటున్నది. కలా ! నిజమా ! అరు భాస్కర్‌ను ప్రేమిస్తుందా ! భాస్కర్ కూడా ప్రేమిస్తున్నాడా ! అదెలా నిజం ! హే ! భగవాన్ ! నన్నెందు కిలా మోసము చేశావు ? ఇంత వరకు తన హృదయం స్పందించనిది, ఒక్క భాస్కర్‌ను చూడగానే ఎందుకు స్పందించాలి ? తను ఎన్ని ఆశలు పెంచుకున్నది. భాస్కర్ తనను ప్రేమిస్తున్నాడని భ్రమించింది. అది నిజము కాదా ! భాస్కర్ లేకుండా తానెలా జీవించ కలదు. అంతా తన ఆశే గాని భాస్కర్‌కు తన మీద ఎలాంటి వుద్దేశ్యము లేదా ! అని బాధపడి తిరిగి తనకు తాను సమాధానము చెప్పుకున్నది. నిజమే ! తనే అపోహ పడినదేమో ! అయినా తనూ, భాస్కర్ గడిపిన రోజులు వ్రేళ్ళతో లెక్కింప దగినవే ! అరుణైతే ఐదు సంవత్సరాలు భాస్కర్‌తో చనువుగా తిరిగింది. వారిద్దరి మధ్య అనురాగం మొలకెత్తుతుందని తనూహించ లేదు భాస్కర్‌తో గడిపిన క్షణాలు కొద్దిగా అయిన ఎన్నో ఏండ్లు పరిచయ మున్నట్లని పించేది. అందుకనే ప్రేమ గుడ్డి దంటారు. భాస్కర్ చిలిపి చూపులన్ని అరుణావే నన్నమాట ! అయిన తను భాస్కర్‌తో గడిపినక్షణాలు మధురము. అవి తను మరచి పోలేదు. తను భాస్కర్‌ను ఎలా మరచిపోగలదు. తను ప్రేమించిన వ్యక్తి చెల్లెలికి భర్తయైతే తను సహించగలదా ! అయిన తను ఏమి చదువుకున్నదని వారిద్దరు




డాక్టర్సు! భార్యభర్తలిద్దరిదీ ఒక్కటే వృత్తియైతే దాంపత్య జీవితంలో సుఖపడతారు. అయినా భాస్కర్, తనకు దూరమవడము లేదు కదా! తన సర్వస్వమైన చెల్లిలినే కదా వివాహమాడేది. తన చెల్లెలికి భాస్కర్ లాంటి వరుడిని తేగలదా! తన చెల్లి అదృష్టవంతురాలు, తాను.... ఇంకా ఆలోచించలేకపోయింది పరిపరివిధాలుగా ఆలోచించి కన్నులనుండి కారుతున్న నీటిని తుడిచివేసికొని దృఢనిశ్చయంతో "తనకు కావలిసింది ఏమీ లేదు. అల్లారుముద్దుగా పెంచిన చెల్లెలి సుఖ సంతోషమే తనకు కావలపింది" అనుకుంటు పైకి లేచింది.

త్వరగావివాహామునకు ముహూర్తము చూడమని శాస్త్రులుగారిని పిలిచినపుడు అరుణ,

"ఇపుడు నా పెళ్ళికి తొందరేముందక్కా, నీ వివాహమైన తరువాతనే చేసుకుంటాము." అంటూ తల వంచుకొని చెప్పిన మాటలకు.

"నాకు పెళ్ళి చేసుకోవాలని లేదు! అరూ! నీవు నీ పిల్లలతో సుఖముగా వుండటమే నాకు కావలసింది, ఇదే నా ఆశయము" అంటూ మృదువుగా చెప్పింది.

అరుణ తల యెత్తి ఆశ్చర్యముగా అక్క మోహం లోనికి చూసింది. అక్కలో ఎంత త్యాగశీలత వున్నది. అదే మాట ఉమతో అన్నది.

"అక్కా! నీఋణము జన్మ జన్మలకు తీర్చుకోలేను" అంటూ రెండు చేతులతో ఉమని చుట్టేసింది.

"పిచ్చి పిల్ల!" అంటూ అరుణను గుండెకు హత్తుకుంటూ తల నిమిరింది.

ఇంక తన జీవితములో మరో వ్యక్తిని ఆహ్వానించ లేదు. ఈ మూగ రాగము నాలోనే వుండి పోవాలని అనుకుంది ఉమ.